సాక్షి
ప్రకాశం

సోమవారం । 18 । నవంబర్ । 2024



అరటి గెల కళకళ

ప్రస్తుతం కంభం చెరువులో నీరు పుష్కళంగా ఉంది. దీంతో చెరువు ఆయకట్టులో సాగుచేసిన అరటి తోటలు కళకళ లాడుతున్నాయి. - 8లో..



ముగిసిన పోలీస్ క్రీడా పోటీలు

ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పోలీసు వార్షిక క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీలను ఎస్పీ ప్రారంభించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేవీ సివిలియన్ ఎంట్రన్స్‌లో ప్రశాంత్‌కు 294వ ర్యాంకు



ఒంగోలు టౌన్: ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన 2017 బ్యాచ్ మెడికో డా.ప్రశాంత్ జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ పరీక్షల్లో 294వ ర్యాంకు సాధించాడు. వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామానికి చెందిన గాజులపల్లి ప్రశాంత్ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. తల్లిదండ్రులు వెంగళ్ రెడ్డి, విజయమ్మ వ్యవసాయం చేస్తుంటారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన నిష్ణాతుల సేవలను త్రివిధ దళాల్లో వినియోగించుకునేందుకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతిష్టాత్మకమైన ఈ ఇన్‌సిట్-2024లో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యాభ్యాసం చేసిన డా.ప్రశాంత్ జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు అభినందనలు తెలిపారు.

శ్రీశైల క్షేత్ర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షునిగా సుబ్బరత్నం



కంభం: అఖిల భారత శ్రీశైల క్షేత్ర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వాసవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం శ్రీశైలంలో జరిగిన సత్రం పాలకవర్గం ఎన్నికల్లో సత్రం గౌరవాధ్యక్షుడు, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు సూచనలతో గోళ్ల సుబ్బరత్నంను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈయన గతంలో కోశాధికారిగా ఉన్నారు. సత్రం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు తెలిపారు.

మాలల మహాగర్జన కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: మాలల మహాగర్జన కరపత్రాన్ని ఆదివారం ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగులు మాట్లాడుతూ ఈ నెల 24న కందుకూరు మెర్సీ గ్రౌండ్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలన్నారు. మాల ఉద్యోగులు, ఉద్యమకారులు, వారి జీవన శైలిని పరిశీలించడానికి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను ఏర్పాటు చేయడం దారుణం అని అన్నారు. రాష్ట్రంలో ఒక ఎస్సీ మాజీ ఐఏఎస్ అధికారి కూడా లేరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు సూచించిన విధంగా న్యూమరికల్ డేటాను తీసుకోవాలంటే నూతనంగా రాష్ట్రంలో జనాభా లెక్కలు తీసుకోవాలన్నారు. ఎస్సీలలో ఉపకులాల్లో సామాజిక, ఆర్థిక మూలాల సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జనార్దన్, బీ గోపినాథ్, కే బాబురావు, వై మల్లిఖార్జున్, కే జాలయ్య, కే రమేష్, బీ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలను దోచుకునేందుకు సిద్ధం

ఒంగోలు టౌన్: స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలను దోచుకునేందుకు కూటమి పాలకులు సిద్ధమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం నగర 13వ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా వాటిని అదుపు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరాభివృద్ధికి రూ.900 కోట్లు కేటాయించాలని సభ తీర్మానం చేసింది. సభకు చీకటి శ్రీనివాసరావు, ఎండీ యాసిన్, జి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించగా జీవీ కొండారెడ్డి, దామా శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్ పాల్గొన్నారు.

రికవరీ

జిల్లాలోని నిరుపేద, నిరుద్యోగ ఎస్సీ యువత స్వయం ఉపాధి పొందేలా చేయూతనందించేందుకు వివిధ కార్పొరేషన్ల కింద కేంద్ర ప్రభుత్వం రుణాలు అందించింది. రుణాలు పొందిన లబ్ధిదారులు ఏళ్ల తరబడి తిరిగి చెల్లించకపోవడంతో కొత్త రుణాలకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదు. రుణాల రికవరీలో అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అర్హులైన వారు కొత్త రుణాలు పొందలేకపోతున్నారు.

- నత్త నడకన ఎస్సీ కార్పొరేషన్ రుణాల రికవరీ
- పట్టించుకోని అధికారులు
- వసూలు కావాల్సిన నిధులు ఎన్ఎస్ఎఫ్‌డీసీ కింద రూ.16.5 కోట్లు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కింద రూ.5.20 కోట్లు
- రికవరీ లేకపోవడంతో నిధులు విడుదల చేయని కేంద్రం



లబ్ధిదారులు వెనక్కు ఇచ్చేసిన కాలువలు శుభ్రం చేసే మిషన్లు ప్రగతి భవన్ ఆవరణలో పడి ఉన్న దృశ్యం

ఒంగోలు వన్‌టౌన్:

జాతీయ షెడ్యూల్డ్ కులాల, ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని ఎస్సీ కులాలకు చెందిన నిరుపేద, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు 2017-18, 2018-19 సంవత్సరంలో అనేక యూనిట్లను లబ్ధిదారులకు అందించారు. ఈ పథకం కింద లబ్ధిదారులు యూనిట్ ధరలో 5 శాతం బేస్ అమౌంట్ చెల్లించి యూనిట్‌ను తీసుకెళ్లవచ్చు. యూనిట్ ధరలో 45 శాతం సబ్సిడీ పోను మిగిలిన 50 శాతం యూనిట్ ధరను లబ్ధిదారులు వాయిదాల రూపంలో చెల్లించాలి. అయితే ఇప్పటి వరకూ యూనిట్లు తీసుకున్న లబ్ధిదారులెవరూ సక్రమంగా వాయిదాలు చెల్లించడంలేదు. కేవలం రూ.3.50 కోట్లు మాత్రమే లబ్ధిదారుల నుంచి రికవరీ చేశారు. మొత్తం ఎన్ఎస్ఎఫ్‌డీసీ (నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.35.46 కోట్ల విలువైన యూనిట్లు లబ్ధిదారులకు మంజూరు చేశారు. సబ్సిడీ పోను రూ.16.5 కోట్లు లబ్ధిదారులు చెల్లించాలి. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్ సఫారీ కర్మచారీ ఫెడరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.9.97 కోట్ల విలువైన యూనిట్లను లబ్ధిదారులు మంజూరు చేశారు. సబ్సిడీ పోను రూ.5.20 కోట్లను లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంది.

ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద ఇన్నోవా వాహనాలు

ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ పథకం కింద 56 ఇన్నోవాలను ఒక్కో యూనిట్ విలువ రూ.16,70,000 లతో మొత్తం రూ.9.18 కోట్లు వెచ్చించి లబ్ధిదారులకు అందించారు.

ఇతియోస్ వాహనాలు

ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ పథకం కింద టయోటా ఇతియోస్ వాహనాలను ఒక్కోటి రూ.9,10,000 లెక్కన మొత్తం 34 వాహనాలను రూ.3.90 కోట్లు వెచ్చించి లబ్ధిదారులకు అందించారు.

ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ కింద రెండు భారీ లారీలను ఒక్కోటి రూ.30 లక్షల చొప్పున రెండు వాహనాలను రూ.60 లక్షలతో లబ్ధిదారులకు ఇచ్చారు.

నాన్ ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ కింద..

కిరాణా దుకాణాలు, బ్రిక్స్ మేకింగ్ యూనిట్‌లు, కాంక్రీట్ మిల్లర్లు, చిన్న, చిన్న మందుల దుకాణాలు ఇటువంటివి కలిపి 349 యూనిట్లు, ఒక్కో యూనిట్ విలువ రూ.6 లక్షలు, కొన్ని రూ.4 లక్షలు చొప్పున మొత్తం రూ.11.43 కోట్లతో రుణాలు అందించారు.

భూమి కొనుగోలు పథకం:

ఈ పథకం కింద నిరుపేదలైన ఎస్సీలకు కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు చేసి తద్వారా జీవనోపాధి కల్పించేందుకు ఉద్దేశించిన పథకం ద్వారా 84 మందికి రూ.11.43 కోట్లతో భూమిని అందించారు.

ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం ద్వారా..

ఎస్సీ సఫాయి కర్మచార లబ్ధిదారులకు ఈ ఆటోలను ఒక్కోటి రూ.2.10 లక్షలతో 47 మందికి యూనిట్లను అందించారు. మొత్తం రూ.96,90,000 విలువైన యూనిట్లు ఇచ్చారు.

డ్రైన్ క్లీనింగ్ యంత్రాలు:

ఒక్కోటి 15 లక్షల విలువైన డ్రైన్ క్లీన్ యంత్రాలు మొత్తం రూ.4.25 కోట్లు వెచ్చించి 28 యూనిట్లు అందించారు. వీటిలో చాలా వరకూ యూనిట్లను లబ్ధిదారులు వెనక్కి ఇచ్చేశారు.

150 మందికి చిన్న, చిన్న వ్యాపారాల నిమిత్తం రూ.4.74 కోట్లతో యూనిట్లను మంజూరు చేశారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

రికవరీ పట్టించుకోని అధికారులు:

రుణాలు మంజూరు చేసి 5 సంవత్సరాలకు పైగా అయినా రుణ రికవరీ తగినంత లేకపోవడంతో నూతన రుణాలకు నిధులను ఎన్ఎస్ఎఫ్‌డీసీ మంజూరు చేయడంలేదు. దీంతో నూతనంగా రుణాలు లబ్ధిదారులకు అందడం లేదు. ప్రతి వాహనానికి ప్రతి సంవత్సరం ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను రవాణాశాఖ అధికారులు అందించాల్సి ఉంటుంది. దీనికి గాను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కూడా ధ్రువీకరణ పత్రాన్ని ప్రతి సంవత్సరం ఇవ్వాలి. అప్పుడు కూడా అధికారులు రుణ రికవరీ చేయడం కోసం గట్టిగా చర్యలు చేపట్టడం లేదు. చిన్న, చిన్న వ్యాపారాల కోసం మంజూరు చేసిన యూనిట్లు ఎక్కడ ఉన్నాయో కూడా అధికారులకు కనిపించడం లేదు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కింద మంజూరు చేసిన సగం వాహనాలు లబ్ధిదారులు తీసుకోకపోవడంతో తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోయాయి.

రుణాలు పూర్తిగా కట్టక కొత్త రుణాలకు నిధులు రాలేదు



20 నెలల క్రితం నేను బాధ్యతలు తీసుకున్నాను. నా హయాంలో రికవరీ శాతాన్ని పెంచాను. రుణాలు పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో నూతన రుణాలకు నిధులు విడుదల కాలేదు.

– అర్జున్‌నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

రేపు నాయీబ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఒంగోలు సిటీ: నాయీ బ్రాహ్మణ కార్తీక మాస వన సమారాధన కార్యక్రమం ఈ నెల 19వ తేదీ మంగళవారం యరజర్ల, కందులూరు మధ్య ఉన్న వి.ఆర్.ఎన్.కె గ్రీన్‌సిటీ వెంచర్‌లో నిర్వహిస్తున్నట్లు ఒంగోలు పట్టణ క్షౌరశాలల సంఘం అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతుల శ్రీనివాసవర్మ పురోహితుల ఆధ్వర్యంలో 366 శివలింగాలతో మహాలింగార్చన అభిషేకం భక్తులందరిచే సామూహికంగా చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఒంగోలు చిన్నారుల ప్రతిభ






విద్యార్థికి పతకాన్ని అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఒంగోలుకు చెందిన చిన్నారులు ప్రతిభ చాటారు. స్థానిక షాదీఖానాలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్థానిక బిలాల్‌నగర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులకు వివిధ కేటగిరీల్లో బంగారు పతకాలు లభించాయి. షేక్ సాధియా ఐమన్ (అండర్ 11), షేక్ సుమయ్య తబస్సుం (అండర్ 10), ఆదిల్ మాలిక్ (అండర్ 6) కేటగిరీల్లో ఈ పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి శిక్షణ ఇచ్చిన ట్రైనర్ పఠాన్ అయూబ్ ఖాన్ సంతోషం వ్యక్తం చేస్తూ ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్గనైజర్ మారుతీప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం తైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందని, శారీరక దృఢత్వంతోపాటు మానసిక దృఢత్వానికి తైక్వాండో మార్షల్ ఆర్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

మృత్యు పాశం..తీరని శోకం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బాలుర మృతితో శోక సంద్రమైన కొప్పోలు అంబేడ్కర్ కాలనీ
- రెండేళ్ల క్రితం భర్తను..ఇప్పుడు ఒకేసారి ఇద్దరు పిల్లల్ని కోల్పోయి ఒంటరైన తల్లి
- కుమార్తె పుట్టిన రోజున కొడుకు దూరమై మరో తల్లి విలవిల

రేష్మంత్ (ఫైల్) వికాస్ (ఫైల్) విశాల్ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: బంధువుల ఇంట్లో గృహ ప్రవేశం.. చెల్లెలి పుట్టిన రోజూ రెండూ ఒకే రోజు సంతోషంగా జరుపుకోవాలని కొత్తగుడ్డలు కొనుక్కొని తిరిగి వస్తున్న ఆ ముగ్గురు బాలురిని వాటర్ ట్యాంకర్ మృత్యువులా దూసుకొచ్చి బలితీసుకుంది. కొప్పోలు ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం స్కూటీపై వస్తున్న ముగ్గురు బాలురిని ఒంగోలు నుంచి వస్తున్న మున్సిపల్ నీళ్ల ట్యాంకర్ వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. కింద పడినవారి మీదుగా వెనక టైరు ఎక్కింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు వైద్యశాలకు తరలించిన కొద్దిసేపటికే మృత్యువాత పడ్డారు. ఈ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఒకే కాలనీకి చెందిన ఇరుగు పొరుగున ఉండే బంధువుల పిల్లలు ముగ్గురు చనిపోవడంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. వారంతా బంధువులే. మేనత్త మేనమామ కొడుకులు, పిన్ని బాబాయ్‌ల కుమారులు. బంధువుల గృహ ప్రవేశానికి సంబంధించిన సందడితో వారంతా సంతోషంగా గడిపారు. ఇప్పుడు అనుకోకుండా జరిగిన ప్రమాదంతో బంధువులంతా శోక సంద్రంలో మునిగిపోయారు. ఇప్పుడు కొప్పోలు అంబేడ్కర్ కాలనీలో ఎవరిని కదిలించినా కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి. కొప్పోలుకు చెందిన బుచ్చిబాబు, పుష్పాంజలి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు రేష్మంత్ (16) ఒంగోలులోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీయెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కూతురు నిత్యశ్రీ పదో తరగతి చదువుతోంది. ఆదివారం వారి బంధువుల ఇంటిలో గృహప్రవేశం జరగాల్సి ఉంది. అలాగే రేష్మంత్ చెల్లెలు నిత్యశ్రీ పుట్టిన రోజు కూడా ఆదివారమే కావడంతో దుస్తులు కొనేందుకు ఒంగోలు వెళ్లాడు. ఏ పని చేసినా తల్లిని అడగడం అతడికి అలవాటు. అదే క్రమంలో దుస్తులు కొనేందుకు వెళ్లిన రేష్మంత్ తల్లి పుష్పాంజలికి ఫోన్ చేశాడు. ఏ రంగు దుస్తులు తీసుకోవాలో తల్లిని అడిగి అవే కొనుక్కున్నాడు. ఇక ఇంటికి బయలు దేరుతున్నానంటూ ఫోన్ పెట్టేశాడు. అదే చివరి మాటలవుతాయని ఊహించలేకపోయానంటూ పుష్పాంజలి కన్నీరు పెట్టుకుంది. ఇక చిన్నారుల్లో పదమూడేళ్ల వికాస్ 8వ తరగతి, పదేళ్ల విశాల్ ఐదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ తల్లికి భారంగా కాకూడదని కొత్తపట్నం హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. తల్లిని చూడకుండా ఉండలేక వారం వారం ఇంటికి వస్తారు. తిరిగి సోమవారం పాఠశాలకు వెళ్లిపోతుంటారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ తల్లిని వదిలేసి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదిస్తోంది. వెక్కి వెక్కి ఏడ్చి మంచం పట్టి పిల్లలను కలవరిస్తోంది.



కన్నీరు మున్నీరవుతున్న వికాస్,విశాల్‌ల తల్లి కోటేశ్వరి

బిడ్డ మీద చాలా ఆశలు పెట్టుకున్నాం

మేము ముగ్గురు అన్నా చెల్లెళ్లం. మా ముగ్గురు కుటుంబాల్లో మొదటి అబ్బాయి వాడు. వాడంటే మా ఇంటిల్లిపాదికి చాలా ఇష్టం. గుండెల్లో పెట్టుకొని పెంచాను. ఇంట్లో అందరం లక్కీ అని పిలుస్తుంటాం. పదో తరగతి వరకు చదువులో కాస్త వెనకబడ్డాడు. ఇప్పుడు ఇంటర్మీయెట్‌కు వచ్చాక బాగా చదువుతున్నాడు. ఎమ్‌సెట్ కోచింగ్ కోసం నిన్ననే ఫీజు కూడా కట్టాం. ఈ రోజు మా అమ్మాయి పుట్టిన రోజు కూడా ఉంది. ఉదయమంతా చెల్లెలితో సరదాగా గడిపాడు. కొత్తగుడ్డలు తెచ్చుకుంటానని చెప్పి ఒంగోలు వెళ్లాడు. ఇంటికి బయలు దేరినప్పుడు కూడా ఫోన్ చేసి చెప్పాడు. ఎప్పుడెప్పుడు ఇంటికొస్తాడా అని ఎదురు చూస్తున్నాను. కానీ ఇంత అన్యాయం జరుగుతుందనుకోలేదు. నా లక్కీ నాక్కావాలి. లక్కీ లేకుండా నేనెలాగ బతకాలో అర్థం కావట్లేదు.

– రేష్మంత్ తల్లి పుష్పాంజలి

ఎవరూ లేని ఒంటరిదాన్నయ్యాను

రెండేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి పిల్లలను చూసుకుంటూ బతుకుతున్నాను. వారిని బాగా చదివించాలని కొత్తపట్నం హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాను. ప్రతి శనివారం ఇంటికి వస్తారు. ఆదివారం నా దగ్గరే ఉంటారు. బయటకు ఎక్కడకూ వెళ్లరు. ఇంటి దగ్గరే ఆడుకుంటారు. ఒంగోలు వెళ్లి బట్టలు కొనుక్కుని తిరిగి వస్తూ ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి దూరమయ్యారు. నన్ను ఒంటరిదాన్ని చేసిపోయారు. ఇప్పుడు నాకంటూ ఎవరూ లేరు. ఎవరి కోసం బతకాలో తెలియడం లేదు.

– వికాస్, విశాల్‌ల తల్లి కోటేశ్వరి

సెపక్‌తక్రా జిల్లా జట్లు ఇవే

ఒంగోలు: సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ గ్రౌండులో ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 50 మందికిపైగా క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వీరు ఈనెల 26, 27 తేదీల్లో నంద్యాల జిల్లాలో నందికొట్కూరు మండలంలో 27వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని సెపక్ తక్రా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యనమల సురేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను చైర్మన్ డాక్టర్ కృష్ణసాయి, కార్యదర్శి రవిప్రసాద్ అభినందించారు.



సెపక్‌తక్రా జిల్లా జట్టు

బాలికల విభాగం : మేఘన, నందిని, తేజ, ప్రసన్న, బ్రాహ్మణి

బాలుర విభాగం: హర్షవర్ధన్, శివ గురుబ్రహ్మం, శివ, ఇద్రోస్, ఆకాష్.

కుంటను మింగిన ఘనులు



బకరాల కుంట స్థలంలో ఉన్న హద్దు రాళ్లు

- బకరాలకుంటలో అనధికార వెంచర్
- కోట్లాది రూపాయల స్థలం ఆక్రమణకు పక్కా స్కెచ్
- గత నెలలో హద్దురాళ్లు తొలగించామన్న రెవెన్యూ అధికారులు
- అనధికార వెంచర్‌లో మళ్లీ వెలిసిన హద్దు రాళ్లు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నీటి కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు జోరందుకోగా అందుకు రెవెన్యూ అధికారుల సహకారం కూడా తోడయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలో సర్వే నంబరు 497 లో 12 ఎకరాల స్థలంలో రజక సామాజికవర్గం దుస్తులు ఉతుక్కోవటానికి గతంలో ప్రభుత్వం బకరాల కుంటను కేటాయించింది. గత నెలలో సోమరాజుపల్లి గ్రామానికి చెందిన కొందరు రజకులు తమకు ఆ స్థలంలో ఇళ్లపట్టాలు ఇవ్వాలని మంత్రి స్వామికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఆయన దరఖాస్తును పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. దీనిపై రెవెన్యూ అధికారులు కూడా సానుకూలంగా స్పందించి ఇళ్లపట్టాలు లేనివారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సుముఖత చూపారు. కానీ తరువాత రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండానే అక్రమార్కులు అధికార పార్టీ అండదండలతో ఆ స్థలంలో ఒక్కొక్కటి 2.50 సెంట్ల చొప్పున సుమారు 60 ప్లాట్లు వేశారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసీ ఊరుకున్నారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగటంతో గత నెల 27వ తేదీ అక్రమార్కులు వేసిన రాళ్లను తొలగించి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. ఈ విషయాన్ని తహశీల్దార్ టీ రవి కూడా ధ్రువీకరించారు. కానీ ప్రస్తుతం ఆ స్థలంలో మళ్లీ హద్దు రాళ్లు ఉండటాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు రెవెన్యూ అధికారులు హద్దు రాళ్లు తొలగించారా? లేక తొలగించకుండానే తొలగించినట్లు ప్రకటించారా? లేక మళ్లీ అక్రమార్కులు హద్దు రాళ్లు వేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమకు కేటాయించిన స్థలంలో గోడలు నిర్మించుకునేందుకు కొందరు సిమెంటు రాళ్లు కూడా తోలుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి గ్రామంలో ఈ సామాజికవర్గానికి చెందిన వారు సుమారు 20 కుటుంబాలవారు మాత్రమే ఉన్నారు. కానీ అదనంగా ప్లాట్లు ఎవరి కోసం వేశారో చర్చనీయాంశమైంది. అంతేకాక ప్లాట్లు తీసుకున్న వారిలో దాదాపుగా అందరికీ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని, కొంతమందికి సొంత స్థలాలు కూడా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిని బట్టి రెవెన్యూ అధికారులు అక్రమార్కుల పట్ల ఏవిధంగా ప్రేమ చూపిస్తున్నారో అర్థమవుతుంది. అంతేకాక ఇటీవల వీఆర్‌ఓ ఆ స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తామని, హెల్త్‌సెంటర్ నిర్మిస్తామని చెబుతున్నాడని అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హెల్త్ సెంటర్ నిర్మిస్తే మళ్లీ ఎలా నిర్మిస్తారని స్థానికులు వీఆర్‌ఓ ను ప్రశ్నిస్తున్నారు. ఈ కుంట ఆక్రమణకు గురికావటాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కోట్లాది రూపాయల విలువైన కుంట స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులను కోరారు. గతంలో కూడా కుంట స్థలం ఆక్రమణకు గురికాకుండా అడ్డుకున్నామని గుర్తు చేశారు. దీనిపై తహశీల్దార్ టీ రవి ని వివరణ కోరగా ఆ స్థలంలో గతనెల రాళ్లు తొలగించామని, ఇప్పుడు రాళ్లు ఉన్న విషయం తనకు తెలియదని వెంటనే రాళ్లు తొలగించి వాస్తవ పరిస్థితిని ఫొటోలు పెట్టాలని వీఆర్‌ఓ వెంకటాద్రిని ఆదేశించినట్లు ఆయన వివరించారు.



భక్తులకు శ్రీరామ పాదుకలు అందజేస్తున్న త్రిదండి రామానుజ చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామి

వైభవంగా శ్రీరామపాదుక పూజ

- పాల్గొన్న త్రిదండి రామానుజ చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామి

ఒంగోలు మెట్రో: వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూల్లో సామూహిక శ్రీరామపాదుక పూజ, విష్ణు సహస్రనామ పారాయణం వైభవంగా నిర్వహించారు. వికాస తరంగిణి సంస్థ జిల్లా శాఖ అధ్యక్షుడు తడికమళ్ల హరిప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరమహంస పరివ్రాజకులు, పద్మభూషణ్ త్రిదండి రామానుజ చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామి పాల్గొన్నారు. స్వామీజీ చేతుల మీదుగా భక్తులందరికీ పంచలోహ శ్రీరామపాదుకల జతను అందజేశారు. పూజా కార్యక్రమంలో 700 మంది దంపతులు పాల్గొన్నారు.

నిర్వాహకులు ఆడిటర్ పి.వి.రంగనాథం, వికాస తరంగిణి సభ్యులు ఎం.లక్ష్మీతులసి, మాధవీలత, శ్రీరామనేని సీతాలక్ష్మి, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



భక్తులకు అభిభాషణ ఆశీర్వచనం చేస్తున్న చిన్న జీయర్ స్వామి

క్లుప్తంగా

నేటి నుంచి కెరీర్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు సిటీ: జిల్లాలో ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో 8, 9, 11 తరగతులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం బోధించే ఉపాధ్యాయులకు రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఒంగోలు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. 8వ తరగతికి బోధించే వారికి 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి, 9, 11 తరగతులు బోధించే వారికి 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ఉంటుందని వివరించారు. సమగ్రశిక్ష, మెల్‌బోర్న్ యూనివర్సిటీ, రోటరీవారి సహకారంతో ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు లేదని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని రిలీవ్ చేసి పంపాలని డీఈఓ సూచించారు.

గ్రానైట్ లారీ సీజ్



సీజ్ చేసిన గ్రానైట్ లారీ

మద్దిపాడు: మద్దిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రానైట్ అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీమకుర్తి నుంచి అక్రమంగా గ్రానైట్ తరలిస్తుండగా, సీతారాంపురం వద్ద విజిలెన్స్ సీఐ తనిఖీ చేశారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి మద్దిపాడు పోలీసులకు అప్పగించారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



మృతి చెందిన విజయమ్మ

కొత్తపట్నం: అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందిన సంఘటన కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన బడుగు విజయమ్మ (42) ఈ నెల 16వ తేదీ బజారుకు వెళ్లి సామానులు తీసుకొస్తున్న సమయంలో కళ్లుతిరిగి పడిపోయింది. సమాచారం అందుకున్న బంధువులు, భర్త గ్రామంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి డాక్టర్లు చెప్పడంతో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి ఆమె చనిపోయింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి కొప్పోలు వెంకటసుబ్బమ్మ హాస్పిటల్‌కు వెళ్లి తన కుమార్తె ఎలా చనిపోయిందో అర్థం కావడం లేదని, మృతిపై అనుమానాలున్నాయని ఫిర్యాదు చేయడంతో హాస్పిటల్ నుంచి అందిన నివేదిక మేరకు కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

- 10 మంది అరెస్టు
- రూ.3,50,500 స్వాధీనం

పొదిలి రూరల్: మండలంలో పేకాట శిబిరాలపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఏలూరు, టి-సల్లూరు గ్రామాల శివార్లలో రహస్యంగా పేకాటాడుతున్న శిబిరాలపై స్థానిక ఎస్సై వేమన ఆదివారం సిబ్బందితో దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. 10 బైక్‌లతో పాటు రూ.3,50,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కాపురంలో ఐదుగురు అరెస్టు, రూ.62,790 స్వాధీనం

మార్కాపురం: పట్టణంలోని అలుగు బజారులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 62,790 రూపాయల నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అరటి గెల.. కళకళ



కంభం చెరువు పరిసరాల్లో సాగుచేస్తున్న అరటి తోటలు



నీటితో కళకళలాడుతున్న కంభం చెరువు



తోటల్లో చెట్లకు కాసిన అరటి గెలలు



మార్కెట్లకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన అరటి గెలలు

ఆసియాలోనే అతి పెద్దదైన కంభం చెరువు ప్రస్తుతం నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఆయకట్టులో సాగుచేసిన అరటి తోటలు గెలలతో కళకళలాడుతున్నాయి. కంభం చెరువు నీటిపై ఆధారపడి పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. వాటిలో సుమారు 700 ఎకరాలకుపైగా అరటి తోటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం అరటి తోటలన్నీ కాపు కాసి కోత కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. రైతులు, రైతు కూలీలు ఆయా పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. అరటి తోటలకు 15 రోజులకు ఒకసారి నీరు పెట్టాల్సి ఉండగా, సాగుకు అన్ని ప్రాంతాలూ అనుకూలం కాదు. కానీ, కంభం చెరువు నీటిని నమ్ముకుని పరిసర ప్రాంత రైతులు అరటి తోటలు సాగుచేస్తున్నారు. గిట్టుబాటు ధర లభిస్తుండటంతో లాభాలు ఆర్జిస్తున్నారు. అయితే, అరటి గెలలను నగరాలు, పట్టణాల్లోని మార్కెట్లకు తరలించాలంటే రవాణా వ్యయం ఎక్కువగా ఉంటోందని, ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి రవాణా సౌకర్యం కల్పిస్తే అరటి రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. - సాక్షి, ఒంగోలు



అరటి గెలలను వాహనంలోకి ఎక్కిస్తున్న కూలీలు



తోటల్లో నుంచి అరటి గెలలను మోసుకొచ్చి నిల్వ చేస్తున్న కూలీలు

గుడ్లవల్లేరు జట్టుకు ప్రథమ స్థానం



ద్వితీయ స్థానంలో నిలిచిన గుంటూరు సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు



సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూ కాకినాడ జట్టు

- ముగిసిన జేఎన్‌టీయూకే కబడ్డీ పోటీలు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈసీ కాలేజీ - గుంటూరు సెయింట్ మేరీస్ జట్లు తలపడగా, ఉత్కంఠ పోరు సాగింది. ఈ మ్యాచ్‌లో గుడ్లవల్లేరు కాలేజీ టీం విజేతగా నిలిచింది. గుంటూరు సెయింట్ మేరీస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ కాలేజీల కార్యదర్శి శిద్దా హనుమంతరావు, కోశాధికారి శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు ట్రోఫీలు అందించారు. అనంతరం యూనివర్శిటీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన యూనివర్శిటీ జట్టు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఆడుతుందని ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్ర తెలిపారు.



ప్రథమ స్థానంలో నిలిచిన గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈసీ కాలేజీ జట్టు

యూనివర్శిటీ జట్టు...

కోట అనంత (గుడ్లవల్లేరు-ఎస్ఆర్‌జీఈఎస్), కె.కీర్తన (గుంటూరు సెయింట్ మేరీస్), దదివి సుస్మిత (రైజ్ కృష్ణసాయి గాంధీ-ఒంగోలు), ఆర్.లక్ష్మి (ఎంఎల్‌సీ మహిళా కాలేజీ-గుంటూరు), పి.అంజనీదేవి (రైజ్ కృష్ణసాయి ప్రకాశం-ఒంగోలు), బి.భార్గవి (శ్రీవాసవీ ఇంజినీరింగ్ కాలేజీ-తాడేపల్లిగూడెం), కె.జ్యోతిశ్రీ (యూనివర్శిటీ కాలేజీ-కాకినాడ), పి.సుశ్మిత(కిట్స్-రామచంద్రాపురం), పి.చందన (ఈశ్వర్ కాలేజీ-నరసరావుపేట), ఐ.శ్రీలక్ష్మి (విజ్ఞాన్ నిరుల- గుంటూరు), డి.కావేరి(పేస్ - ఒంగోలు), ఎన్.సత్యదుర్గాఐశ్వర్య (ఐడియల్ కాలేజీ-కాకినాడ).

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ స్వాతి

కొమరోలు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కొమరోలులోని ఇస్లాంపేటలో నిల్వ ఉంచిన 11.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ వై.స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ రేషన్‌బియ్యంపై తహసీల్దార్ ధనలక్ష్మికి సమాచారం అందడంతో వెంటనే తమకు సమాచారం అందించారని తెలిపారు. అక్కడికి చేరుకుని 23 బస్తాలలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని, వాటి విలువ రూ.42,550 ఉంటుందని తెలిపారు. ఓ ఇంటి బయట వరండాలో ఈ రేషన్ బియ్యాన్ని ఉంచారని, ఎవరు నిల్వ ఉంచారో ఇంటి యజమానికి కూడా తెలియదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. రేషన్ బియ్యాన్ని గిద్దలూరులోని గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఎస్‌జీఎఫ్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఈ నెల 19వ తేదీ ప్రతి నియోజకవర్గంలో నిర్ణయించిన స్కూలు ఆవరణలో నిర్వహించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ హాజీరాబేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి మార్కాపురంలోని బాలుర జెడ్పీహెచ్‌ఎస్‌లో, ఒంగోలు-ముక్తినూతలపాడు జెడ్పీహెచ్‌ఎస్, వై.పాలెం-రామచంద్రాపురం జెడ్పీహెచ్‌ఎస్, గిద్దలూరు- గిద్దలూరు బాలుర జెడ్పీహెచ్‌ఎస్, కనిగిరి- సీఎస్ పురం మండలం నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్, కొండపి- సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతనూతలపాడు- నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు జెడ్పీహెచ్‌ఎస్, దర్శి- కురిచేడు మండలం బోధనంపాడు జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాలను ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు నిర్వహిస్తారని తెలిపారు.

నిరుపయోగంగా ఉన్న లాడ్జిలో మృతదేహం

- అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



లక్ష్మయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దదోర్నాల: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పెద్దదోర్నాల మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఓ లాడ్జిలో ఆదివారం వెలుగుచూసింది. అర్ధవీడు మండలం గన్నేపల్లికి చెందిన పిక్కిలి లక్ష్మయ్య అలియాస్ లక్కీ (24) మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మయ్య మండలానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకుని కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే నివసిస్తున్నాడు. గతంలో ఓ నూడిల్స్ షాపులో పనిచేసి ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య విభేదాలు రావడంతో మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న గ్రీన్ ఇండియా లాడ్జిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మృతిచెందగా, ఎడమ చేతికి సెలైన్ పెట్టించుకున్నట్లు క్యాన్లా కూడా ఉండటంతో ఆరోగ్యం సరిగా లేక చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులతో పాటు ఓ సోదరుడు కూడా చనిపోయాడని, మరో సోదరుడు ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను కారు ఢీకొని ఒకరు మృతి



ఘటన స్థలంలో ఢీకొట్టిన కారు



మృతుడు యాతం నాగిరెడ్డి

కనిగిరి రూరల్: బైక్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన కనిగిరి మండలంలోని చాకిరాల సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన యాతం నాగిరెడ్డి (56) కనిగిరి నుంచి చాకిరాల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. సీఎస్ పురం వైపు నుంచి ఎదురుగా వేగంగా వచ్చిన కారు చాకిరాల బ్రిడ్జి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బైక్‌పై ఉన్న యాతం నాగిరెడ్డికి రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టీ శ్రీరాం తెలిపారు.

ముగిసిన పోలీస్ క్రీడా పోటీలు



విజేతలుగా నిలిచిన పోలీస్ క్రీడాకారులతో ఎస్పీ దామోదర్



విజేతలైన మహిళా పోలీస్ క్రీడాకారులతో ఎస్పీ...

- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన గురుస్వామి

ఒంగోలు టౌన్: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోలీసు వార్షిక క్రీడా పోటీలు-2024 ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు పురుషులకు నిర్వహించిన వంద మీటర్ల పరుగు పందెంను ఎస్పీ ఏఆర్ దామోదర్ జెండా ఊపి ప్రారంభించారు. ఉత్కంఠభరితంగా సాగిన వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌ను ఎస్పీ ఆసక్తిగా తిలకించారు. అనంతరం నాలుగు పోలీసు సబ్ డివిజన్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ నుంచి పోలీసు క్రీడాకారులు క్లోజింగ్ మార్చ్ నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందన చేశారు. పోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజూ చురుగ్గా విధులు నిర్వహించేందుకు పోలీసులకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోజువారీ జీవితంలో క్రీడలు, వ్యాయమాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ఓటమిని కూడా ఆనందంగా స్వీకరించినప్పుడే జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కోగలమన్నారు. క్రీడల్లో అయినా, విధుల్లో అయినా కలిసికట్టుగా పనిచేసినప్పుడే విజయం సాధించగలుగుతారని చెప్పారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి మెడిటేషన్, యోగా వంటివి చేయాలన్నారు. క్రికెట్‌లో ఐటీ కోర్ టీం విజేతగా నిలవగా, కబడ్డీలో డీఏఆర్ జట్టు గెలుపొందింది. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో డీఏఆర్‌కు చెందిన కానిస్టేబుల్ గురుస్వామి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కిండర్ గార్డెన్ పిల్లలకు పుస్తకాలు లేని బోధన

- అపుస్మా జిల్లా అధ్యక్షుడు మాధవరావు

ఒంగోలు సిటీ: కిండర్ గార్డెన్ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం పుస్తకాలు లేని బోధన కొనసాగించాలని అపుస్మా జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు అన్నారు. అపుస్మా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏడుగుండ్లపాడులోని హర్షిణి జూనియర్ కాలేజీలో 21వ శతాబ్దపు నైపుణ్యాలు పెంపొందించే ‘ఎడ్యు ఈజీ కాన్సెప్ట్’ ద్వారా ఎలా బోధించాలనే అంశంపై ప్రైవేటు స్కూళ్లలోని ప్రీ ప్రైమరీ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేజీ స్థాయి పిల్లలకు పుస్తకాలు ఉపయోగించకుండా వినూత్న విధానాల ద్వారా ఏ విధంగా విద్యా బోధన చేయాలనే విషయంపై విశాఖపట్నం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టీచర్లు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని విద్య బోధించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని ట్రైనర్ మళ్ల వాణిశ్రీ తెలిపారు. హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, అపుస్మా జిల్లా గౌరవాధ్యక్షుడు బి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు, ఎ.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు, ఒంగోలు యూనిట్ అధ్యక్షుడు మురళీకృష్ణ, గౌరవ అధ్యక్షుడు నేతాజీ మల్లికార్జునరావు, సెక్రటరీ జూపిటర్ వంశీ, లక్ష్మణ, టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అపుస్మా జిల్లా అధ్యక్షుడు మాధవరావు